# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. కాగా ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ ప్రజావాణిలో తొమ్మిది మంది తమ భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన ఆర్జీలు మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ద్వారా నారాయణపేట ప్రజావాణి విభాగానికి రిజిస్టర్ పోస్టు ద్వారా రాగా, ఆ తొమ్మిది మందిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు ఇక్కడి సిబ్బంది సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమానికి పిలిపించారు. ఆ తొమ్మిది మందిలో ఎనిమిది మంది ఫిర్యాదు దారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్వయంగా మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి..

**ప్రజావాణికి 60 దరఖాస్తులు: కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 29, ప్రభాతవార్త :** ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖాధికారులు, తహశీల్దార్లు తమ పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్లో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్. తిరుపతి రావుతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి ఫిర్యాదు దారునకు ఒక కాపీ పంపిస్తూ మరో కాపీని జిల్లా కలెక్టర్ కు పంపిచవల్సింది గా ఆదేశించారు. అంతే కాకుండా ప్రజల నుంచి సమస్యల పై చాలా దరఖాస్తుల వచ్చాయని, వాటిని ఏ శాఖకు సంబంధించి ఆ శాఖ వారు సత్వరమే పరిష్కరించి ఫిర్యాదు దారులకు సమాచారం ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. పరిష్కరించేందుకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోమవారం రోజు జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 60 దరఖాస్తులు వచ్చాయని తెలియజేశారు.



## ఓటరు జాబితా ధరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త:** నూతర ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ కోసం వచ్చిన ధరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణల కోసం ఫామ్ 6,7,8ల ద్వారా అందిన ధరఖాస్తుల నిర్వహణ, ధరణి పెండింగ్ ధరఖాస్తులపై అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కే.సీతారామారావులతో కలిసి తహసీల్దార్లు, ఆర్డీఓలతో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ సమీక్షించారు. వీడియాఓ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓల వారీగా వచ్చిన ఫారం 6,7,8 ధరఖాస్తు ఫారాలు పరిశీలించి ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితా విడుదల కానుందని, తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను విడుదల చేసేందుకు తహసీల్దార్లు ధరఖాస్తు ఫాంలను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాలో చేరేలా చూడాలన్నారు. నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణల కొరకు అందిన ధరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి ఓటర్ల సవరణ పరిశీలన అధికారి రోల్ అబ్జర్వర్ పర్యటించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ లాగిన్‌లో ఉండే ధరణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. బినామీ పేర్లతో కొనసాగే రేషన్ షాపుల వివరాలను, నూతన రేషన్ షాపులకు నమోదు చేసుకున్న ధరఖాస్తుల వెంటనే అందించాలని ఆదేశించారు. మీసేవా ద్వారా వచ్చిన ధరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కే.సీతారామారావు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



## ప్రజావాణిలో అధికారులకు జిల్లా కలెక్టర్

**గద్వాల ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త :** జిల్లాలో ప్రజావాణికి వచ్చే ప్రతి సమస్యలను పరిష్కరించే విధంగా తహసిల్దార్లు, అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశం హాలులో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి ధరణికి సంబంధించి 5, భూ సమస్యలపై 45, ఆసరా పెన్షన్లు 3, ఇతర సమస్యలకు సంబంధించి 21, మొత్తం 74 దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్ చేసి దరఖాస్తుదారులకు రశీదులు అందజేయాలని అన్నారు. వచ్చిన దరఖాస్తులను పది రోజుల్లో క్లియర్ చేయాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులు ఆన్‌లైన్ చేసిన తర్వాత సంబంధిత అధికారికి వాటిని పంపించాలని అన్నారు. జిల్లాలో వడ్డేపల్లి మండలంలో భూ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని, ఇటిక్యాలలోని మునగాల గ్రామంలో గొర్రెల పంపిణీ, రాజోళి మండలం ముండ్లదిన్నె గ్రామంలో భూ ఆక్రమణ కేసులపై ప్రజల నుండి ఫిర్యాదులు అందాయని తెలిపారు. శాఖల వారిగా ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయని, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని, వచ్చిన దరఖాస్తులను ఎలా పరిష్కరిస్తున్నారని, ఎన్నింటిని పరిష్కరించారో రిపోర్టు అందజేయాలన్నారు. తహసిల్దార్ల స్థాయిలో ఎటువంటి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. వచ్చిన దరఖాస్తులను తేదల వారిగా, శాఖల వారిగా రిజిస్టర్‌లో నమోదు చేసి దరఖాస్తు దారులకు రశీదు అందజేయాలన్నారు. గొర్రెల పంపిణీపై ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయని, దీనిపై అందరికి తెలిసేలా సమాచారం ఇవ్వాలని పశుసంవర్ధకశాఖ అధికారికి ఆదేశించారు. పెన్షన్‌కు సంబంధించి వేరే కౌంటర్ ఏర్పాటు చేసి పెన్షన్ దరఖాస్తులను సంబంధిత అధికారులను తీసుకోవాలన్నారు. ధరణిపై ఉన్న సమస్యలను పూర్తి చేయాలన్నారు. భూసమస్యలకు సంబంధించి దరఖాస్తులు ఎక్కువ వస్తున్నందున సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్లు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో శాఖలవారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఈ.వి.యం లు అత్యంత సురక్షితం..

**ఈవియం, వివి ప్యాట్‌ల ప్రదర్శన :కలెక్టర్**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త:** ఎన్నికల నిర్వహణకు వినియోగిస్తున్న ఈ.వి.యం.లు అత్యంత సురక్షితంతో పాటు ఖచ్చితత్వంతో కూడినవని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా సోమవారం ఉదయం ఐడిఓసి లోని రూమ్ నెంబర్ 10లో ఈవియం, వి.వి. ప్యాట్‌ల ప్రదర్శనను అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్.తిరుపతిరావు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ప్రజా ప్రతినిధులు నమూనా ఓటును వినియోగించి తాము వేసిన అభ్యర్థి కే ఓటు పడిందా లేదా అని నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ భారతదేశంలో ఎన్నికల నిర్వహణకు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు అత్యంత సురక్షితమైనవని తెలిపారు. వీటికి ఇతరత్రా ఎలాంటి డివైజ్‌తో కానీ నెట్‌వర్క్‌తో కానీ అనుసంధానం చేసేందుకు వీలు లేనివని తెలిపారు. ఓటరు తమ ఓటును ఏ గుర్తు పై నొక్కుతారో అదే గుర్తుకు తన ఓటు నమోదు అవుతుందన్నారు. ఇప్పటి వరకు ప్రపంచంలో వీటి పనితీరును ఎవరు తప్పుగా నిరూపించలేదని తెలిపారు. నేటి నుండి కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 10 లో ఈవియం వివిప్యాట్‌ల ప్రదర్శన ఉంటుందని ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎవరైనా సర్ ప్రదర్శన కేంద్రంలో నమూనా ఓటింగ్ ను వేసి పనితీరును పరిశీలించుకోవచ్చని తెలియజేశారు. అంతకుముందు కలెక్టరేట్‌లోని ఈవియం గోదాం నుండి ప్రజాప్రతినిధులు సమక్షంలో ప్రదర్శన కొరకు ఈవియం, వివిప్యాట్‌లను తీసుకున్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్.తిరుపతిరావు, ప్రజాప్రతినిధులు, బిజెపి నుండి డి.ప్రవీణ్, సిపియం నుండి పరమేశ్వరి, సిపిఐ నుండి జి.ఎల్లస్వామి, ఎంఐయం నుండి ఎంఎ రహీమ్, తదితరులు పాల్గొన్నారు.




## నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం...

**- జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ ఊష**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త:** జిల్లా స్థాయి ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఎస్‌జెఆర్ ఫంక్షన్‌హాల్ నందు మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని నాగర్‌కర్నూల్ జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి ఊష సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జెడ్పీ చైర్ పర్సన్ అధ్యక్షతన నాగర్‌కర్నూల్ పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ టెలిఫోన్ భవన్‌క ఎక్స్ఛేంజ్ భవన సమీపంలో గల ఎస్ జే ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ప్రారంభం కానుందని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు సమావేశానికి హాజరు కావాలని కోరుతూ జిల్లా గౌరవ మంత్రివర్యులు, ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలకు సమావేశం అజెండా అంశాలతో సమాచారం పంపినట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల ప్రగతి నివేధికలతో సకాలంలో హాజరు కావాలన్నారు.

# జీపి నిధులు ల్యాప్స్..!

**బిల్లులు రావడంలో ఆలస్యం**
**విసుకున్న కాంట్రాక్టర్**
**అర్థాంతరంగా నిలిచిపోయిన**
**గ్రామపంచాయతీ భవనం**

**గోపాలపేట, జనవరి 29, ప్రభాతవార్త :** పల్లె పల్లెల్లో తండాలలో ప్రజలకు సేవలు అందించేందుకు గ్రామ పంచాయతీ భవనాలు ఉండాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం 2018 లో శిథిలావస్థలో ఉన్నాయి దీంతో గత ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీలను నిర్మించాలని ఎన్ ఆర్ జి ఎస్ పథకం కింద 13 లక్షల నిధులను మంజూరు చేసింది. వనపర్తి జిల్లా గోపాలపేట మండలంలో 2018 లో అన్ని గ్రామాలలో గ్రామపంచాయతీ భవనాలు పూర్తి అయ్యాయి. కానీ గోపాలపేట మండలం మున్ననూరు గ్రామంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మున్నూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనం వెక్కిరిస్తుంది. మున్ననూరు గ్రామానికి చెందిన ఓ కాంట్రాక్టర్ 13 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మిస్తానని పనులు ప్రారంభించారు. ప్రభుత్వం ఎస్టిమేషన్ ప్రకారం ఎంత పని జరుగుతే అంతకే ఎంబి రికార్డులు చేసి బిల్లులు ఇస్తారు. మున్నూరు గ్రామంలో బేస్మెంట్ పిల్లర్ల వరకు పనులు జరిగాయి. కాంట్రాక్టర్ బిల్లు పెట్టాలని గత ఏ ఈ తెలిపినట్లు తెలుస్తుంది. చేసిన పనులకు రూ.6 లక్షలు ఎంపీ రికార్డు చేసి పి ఆర్ ఏ ఈ పంపించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో చేసిన పులకు సంవత్సరం నర తర్వాత ఆ గత ప్రభుత్వం బిల్లు ఇవ్వడంలో ఇంత ఆలస్యం చేయడం వల్ల అప్పు రెండింతలై కూర్చుంది. దీంతో చేసిన బిల్లులు రావని ఆ కాంట్రాక్టర్ విసుకు చెంది నిరాశతో నిర్మాణం చేయకుండా పనులను వదిలేశారు. దీంతో అర్థాంతరంగా మున్నూరు గ్రామపంచాయతీ భవనం నిలిచిపోయింది. అందులో ఓ కాంట్రాక్టర్ కూడా మృతి చెందినట్లు తెలిసింది నాటి నుంచి నేటి వరకు కూడా మున్నూరు గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం ఎవరు ముందుకు రాలేదు. దీంతో మున్నూరు గ్రామపంచాయతీకి వచ్చిన నిధులు ల్యాప్స్ అయిపోయాయి. మళ్లీ కొత్త ప్రభుత్వం ఈ గ్రామ పంచాయతీకి భవన నిర్మాణం కోసం నిధులకు కేటాయిస్తే కొత్త వారు భవన నిర్మాణం పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ప్రభుత్వం చేసే పనులకు బిల్లులు చేయకుండా ఆలస్యం చేయడం పట్ల అభివృద్ధి పనులు గుంటుపడుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.



అర్థాంతరంగా నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవనం

### ఎక్కడ వేసిన గొంగళి అక్కడే...



కాంగ్రెస్‌పార్టీ గ్రామఅధ్యక్షుడు 2018లో గత ప్రభుత్వం కొత్త గ్రామపంచాయతీ భవన నిర్మాణం చేయాలని నిధులు మంజూరు చేసిందే కానీ బిల్లులు చేయడంలో ఆలస్యం చేయడం పట్ల భవనం పట్టుకున్న కాంట్రాక్టర్ అప్పులు కావడంతో నిర్మాణం చేయకుండా ఆపేశారు. దీంతో మా గ్రామ పంచాయతీ భవనం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్న చందంగా మారింది. ఉన్న భవనం కూల్చివేయడం కొత్త భవనం పూర్తి కాకపోవడం పట్ల 2018 నుంచి గ్రామపంచాయతీ కమిటీ హాల్ లోనే కొనసాగిస్తున్నారు. అక్కడే ప్రజల సమస్యలు చర్చలు జరుగుతున్నాయి.

*దీరమల్లు యాదవ్.*

### ఎస్సీ వాడ అని చిన్న చూపా...



మా మున్నూరు గ్రామంలో మా ప్రభుత్వం ఉన్న రోజుల్లో తానే ముందుండి వుడ్ వర్క్ కింద ఈ గ్రామ పంచాయతీ భవనం నిర్మాంచాం. అలాగే ఉన్న ఇంకా కొన్ని ఏళ్ల వరకు పనులు జరిపించుకోవచ్చు కానీ కొత్తగా ఏర్పాటు అయిన తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉన్న గ్రామ పంచాయతీ భవనం కూల్చి సమస్యలు చెప్పుకోవడానికి రోడ్ల పైనే చెప్పుకోవాలన్న పరిస్థితి ఏర్పడింది. కానీ ఈ గ్రామ పంచాయతీ భవనం ఎస్సీ వాడలో ఎందుకు నిర్మించాలన్న చులకనతోనే పనులు జరిపించడం లేదు.

*టిడిపి మాజీ సర్పంచ్ కోటయ్య.*

### కొత్త నిధులు వస్తే పున ప్రారంభిస్తాం..



2018లో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. గ్రామపంచాయతీ భవన నిర్మాణం పిల్లర్ల వరకు పనులు జరిపించి వదిలేశారు. దీంతో ఉన్న నిధులు వాడుకోకుండా ఉండడం పట్ల ఆ నిధులు లాప్స్ అయ్యాయి. కొత్త ప్రభుత్వం ఏమైనా నిధులు ఇస్తే కొత్తవారితో మిగతా పనులు పూర్తి చేయించి గ్రామపంచాయతీ భవనం పూర్తి అయ్యేటట్లు చూస్తాము.

*పిఆర్‌ఏఈ భాస్కర్.*

## అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి..

**- సీఎం మన ప్రాంతం వారు కావడం మన అదృష్టం**
**- సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**వెల్దండ, జనవరి 29 ప్రభాతవార్త:** అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహిస్తే ఊపేక్షించేది లేదని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయజైపాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. సీఎం మన ప్రాంతం వారు కావడం మనందరి అదృష్టమన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే విధంగా కృషిచేయాలని, గ్రామాల్లో ప్రజలు తాము నివాసం ఉండే గృహాలపై విద్యుత్ వైర్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా కాకపోవడం, అవసరాల నిమిత్తం నీరు అందించడంలేదని, 20వేలలీటర్ల నీరు అవసరం ఉంటే 5వేలలీటర్ల నీరు అందిస్తూ బిల్లులు మాత్రం 20వేలలీటర్లకు తయారు చేస్తున్నారు. భగీరథ నీరు సరిగ్గా అందించాలి లేదంటే బిల్లులైన సరిగ్గా చేయాలని కాంట్రాక్టర్ కాజేస్తుండటం సరైన పద్ధతికాదని, ఇది ప్రజల డబ్బు అని వివరించారు. కేఎల్ఐ కాల్వలో జాప్యం జరిగితే సహించేది లేదన్నారు. కాల్వ భూ నష్ట పరిహారం క్రింద రైతులకు ఎన్ని డబ్బులు మంజూరు కావాలో అధికారులు చెప్పేవి రూ. 16కోట్లు అయితే, రైతులు చెప్పేవి రూ.40కోట్లు అని, సరైన వివరాలతో నివేధిక తయారు చేయాలని అధికారులకు సూచిం చారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**సర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్యే**

ఈ నెల 31తో సర్పంచ్‌ల పదవి కాలం ముగియనుండటంతో ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు యెన్నం భూపతిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్ ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రవికుమార్, సూపరింటెండెంట్ మోహన్‌లాల్, ఎంపీఓ సునిత, సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డి, ఎంపీటీసీలు మోతిలాల్‌నాయక్, వెంకట్‌రెడ్డి, చక్రవర్తి, సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, రామకృష్ణ, పత్యానాయక్, గోరటి శ్రీనివాస్, అంజయ్య, శ్రీనునాయక్, శారదమ్మ, మంగ్లీ తదితరులు ఉన్నారు.

## మూడోసారి మరోసారి మోడీ సర్కార్: డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 29 ప్రభాతవార్త :** కేంద్రంలో ముచ్చటగా వచ్చేది మళ్లీ బిజెపి ప్రభుత్వమేనని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర భారతీయ జనతాపార్టీ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ నియోజకవర్గం ధర్మాపూర్ గ్రామంలో వాల్ పెయింటింగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచి నియోజకవర్గం వరకు ప్రతి ఒక్క కార్యకర్త, తన ఇంటిగోడ, పార్టీ కార్యాలయం, పరిసరాల్లో ప్రతి ఒక్కరు మన పార్టీ కమలం పువ్వు వాల్ పెయింటింగ్‌ను వెయ్యాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా 247 సంవత్సరం వరకు అభివృద్ధి చెందిన దేశంగా భారతదేశాన్ని తయారు చేయడమే లక్ష్యంగా మోడీ ముందుకు వెళ్తున్నారని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని రెండు పార్లమెంట్ స్థానాలను బిజెపి స్వాధీనం చేసుకుంటుందని, రాష్ట్రంలోని 10కి పైగా పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. మోడీ హయాంలోనే గత 15 ఏళ్లలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. 370 ఆర్టికల్ రద్దు, భారతీయుల 5 ఏళ్ల నాటికల రామాలయం నిర్మాణాన్ని సాధ్యం చేసి చూపించిన ఘనుడు మోడీ అని చెప్పారు. కార్యక్రమంలో బిజెపి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పి. రవిందర్‌రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమలం పువ్వు పెయింటింగ్ వేస్తున్న డికె అరుణ

## హామీలు అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయం..

**ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**కొల్లాపూర్, జనవరి 29 ప్రభాతవార్త :** నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి, దేదినేనిపల్లి, పెద్ద కార్పాముల గ్రామాలలో పలు అభివృద్ధి పనులను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. సోమవారం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పబ్లిక్ హెల్త్‌సబ్‌సెంటర్, మీసేవ కేంద్రం, వెటర్నరీ హాస్పిటల్, బస్ షెల్టర్, వెజిటేబుల్ మార్కెట్, ఎంపిడిఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్, వృద్ధాశ్రమం ప్రారంభించారు. దేదినే నిపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారం భించారు. పెద్ద కార్పాముల గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో వాటర్ ఫిల్టర్ మిషన్ ప్రారంభించారు. అదేవిధంగా సావిత్రిభాయ పూలె విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉందని ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మండల ఎంపిపి, జడ్పీటిసి, సింగిల్‌విండో ఛైర్మన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల ప్రస్తుత, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

## ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి..

**ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ : కలెక్టర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 29 ప్రభాతవార్త :** ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, డిఆర్‌డిఓ యాదయ్య, డిఆర్‌ఓ కెవి వి రవికుమార్, జడ్పీ సీఈఓ జ్యోతి, జిల్లా అధికారులు ప్రజావాణి సందర్భంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం ఎక్కువగా ఫిర్యాదులు రాగా, పెన్షన్, ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన వాటిపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. కాగా కొన్ని ఫిర్యాదుల పరిష్కారం విషయమై జిల్లా కలెక్టర్ విడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిఓలు, తహసిల్దార్‌లతో నేరుగా మాట్లాడుతూ ఫిర్యాదు వివరాలను అధికారులకు తెలియజేస్తూ వాటికి సంబంధించి చర్య తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. జిల్లాస్థాయి ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులను తన వద్దకు పిలిపించుకుని కొన్ని ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని జాప్యం చేయవద్దని దాని వల్ల ఫిర్యాదుదారులకు ఇబ్బంది కలుగుతుందని, ఇదే విషయాన్ని కింది స్థాయి అధికారులకు తెలియజేయాలని చెప్పారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్

## ఏసీబీకి చిక్కిన లైన్‌మెన్..

**-రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జీవరత్నం**

**అయిజ, జనవరి 29, ప్రభాతవార్త:** ప్లాట్‌లో పోల్ తీసుకునేందుకు రూ. 20వేలు డిమాండ్ చేసిన ఘటనలో లైనమెన్ ఏసీబీ అధికారులకు చిక్కిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలో చోటుకున్నది. వివరాల్లోకి వెళ్తే..అయిజ మండల కేంద్రంలో స˘ర్వేనెంబర్ 733లో వీరేష్ అనే వ్యక్తి ప్లాట్ కొన్నాడు. ఈ క్రమంలో విద్యుత్ పోల్ బిగించేందుకు లైన్‌మెన్ జీవరత్నంను సంప్రదించాడు. పోల్‌ఏర్పాటుకు రూ.25వేల లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో వీరేష్ అనే వ్యక్తి నుంచి అపోలో ఫార్మసీ వద్ద రూ.20వేల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారి హరికృష్ణ గౌడ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఆయన తెలిపారు. ఏ ప్రభుత్వ శాఖ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే 1064టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. లంచం అడిగే వారిని ఉపేంక్షించేది లేదని చెప్పారు.



పట్టుబడ్డ లైన్‌మెన్ జీవరత్నం

## పథకాల అమలుపై దృష్టి సారించాలి..

**మహబూబ్‌నగర్ కలెక్టర్ జి.రవినాయక్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 29 ప్రభాతవార్త :** ప్రభుత్వ ప్రాధామ్య పథకాల అమలుపై దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో మాట్లాడుతూ పురోగతిలో ఉన్న అన్ని ప్రభుత్వ పథకాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున పురోగతిలో ఉన్న పనులన్ని పూర్తి చేయాలన్నారు. ఈ ఆఫీస్‌లో ఉన్న పైళ్లు అన్నింటిని క్లియర్ చేయాలని ఆదేశించారు. ప్రి మెట్రిక్, పోస్టు మెట్రిక్ - మిగతా2లో..



మాట్లాడుతున్న కలెక్టర్ జి.రవినాయక్

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాన్ అండ్ లెర్నింగ్ పుస్తకాల పంపిణీ..

**కల్వకుర్తిరూరల్, జనవరి 29 ప్రభాతవార్త:** ప్రపంచంలో టెక్నాలజీ మారుతున్న సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో మార్పు రావాల్సిన అవసరం ఎంతైన ఉందని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పేర్కొ న్నారు. ఐక్యత ఫౌండేషన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి 10వ తరగతి విద్యార్థులకు సమకూర్చిన స్కాన్ అండ్ లెర్నింగ్ పాఠ్య పుస్తకాలను సోమవారం కల్వకుర్తి మండల పరిధిలోని తాండ్ర గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జహంగీర్ ఆధ్వర్యంలో



ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులకు విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతునన విద్యార్థులకు ఆధునిక పాఠ్యంశాలలో భాగంగా స్కానింగ్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ ఫోన్ ద్వారా విద్యార్థులు తమ సబ్జెక్టులపై స్కాన్ చేసినట్లు అయితే అందులో పూర్తి వివరాలు సమకూర్చామన్నారు. కార్యక్రమంలో గ్రామమాజీ ఉపసర్పంచ్ అల్లాజీ, వార్డుసభ్యులు వెంకటయ్య, బండి సుదర్శన్, సుల్తాన్, కోఆప్షన్ బాలస్వామి, గ్రామస్తులు శ్రీను, యశ్వంత్, కళ్యాణ్, వినోద్, ఫౌండేషన్ సభ్యులు శేఖర్, హసన్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## మెడికల్ ఉద్యోగులుగా ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు..





**వీపనగండ్ల, జనవరి 29, ప్రభాతవార్త :** మెడికల్ వైద్య నర్స్ స్టాఫ్ నర్స్ లకు జరిగిన పరీక్షల్లో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురికి ఉద్యోగాలు రావడం విశేషం వీపనగండ్ల మండలంలోని కల్వరళ్ళ గ్రామానికి చెందిన ముగ్గురికి ఉద్యోగాలు రావడం జరిగింది. ఒకరు స్టాఫ్ నర్స్ ఇద్దరికీ ఆఫీసర్ ఉద్యోగాలు రావడం జరిగింది. వారిలో ఒకరు చింత శోభలత స్టాఫ్ నర్స్‌గా ఆఫీసర్ ఉద్యోగులుగా పోచమని హరికృష్ణ కురుయమ్మ లకు ఉద్యోగాలు వచ్చినట్లు వారు తెలిపారు. అయితే ఒకే గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు రావడం వల్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే మొదటి నుండి ఈ గ్రామంలో చదువుపైనా ఆ గ్రామ విద్యార్థిని విద్యార్థులకు ఎక్కువగా మక్కువ ఉండేది అయితే ఏ ఉద్యోగాలు నోటిఫికేషన్ వేసిన అందులో తప్పకుండా ఈ గ్రామానికి చోటు దక్కుతుంది.

## బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ ఉపాధ్యక్షులుగా అజయ్ ఎన్నిక..

**గోపాల్‌పేట జనవరి 29 ప్రభాతవార్త:** బిఎస్‌పి పార్టీ వనపర్తి అసెంబ్లీ ఉపాధ్యక్షులుగా బంకల అజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి జిల్లాలో జరిగిన కమిటీ ఏర్పాటులో బంకల అజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ బీఎస్పీ పార్టీకి సేవలందించి పార్టీ బలోపేతం కోసం రాత్రింబవళ్లు పనిచేసినందుకుగాను పార్టీ అధినేత తనను గుర్తించి అసెంబ్లీ ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవడం వారికి పెద్దలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు పార్టీ బలోపేతం కోసం పార్టీ పై నమ్మకం ఉంచి తాను కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



## నూతన ఎస్సైని కలసి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్

**కోయిల్‌కొండ, జనవరి 29 ప్రభాతవార్త :** కోయిల్‌కొండ నూతన ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టిన రాఘవేందర్‌ను సోమవారం మండల కేంద్రమైన కోయిల్‌కొండకు చెందిన గ్రామ సర్పంచ్ బి. కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బి. కృష్ణ మాట్లాడుతూ అన్ని పార్టీలతో కలిసి ముందుకు సాగాలని ఎస్సైకి సూచించడం జరిగిందన్నారు. మండల అభివృద్ధిక తమవంతు సహకారం అందిస్తామని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో




గ్రామ మాజీ సర్పంచ్ జి. రాజ్‌కుమార్, గ్రామ పెద్దలు డి. నారాయణగౌడ్, కుమ్మరి రాజు, మండల టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు లక్ష్మినారాయణగౌడ్, నాయకులు టివి ఖాజా మైనొద్దిన్, పి. నాగేష్, నజీముద్దిన్, ఎం.భరత్, వెంకట్, బి.రవి, శ్యాంసుందర్, జి.శంకర్, రమేష్, వడన్న తదితరులు పాల్గొన్నారు.

## ఈ యాసంగిలో వేరుశనగ పంట అధిక దిగుబడులు

**వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి**

**లింగాల, జనవరి 29 ప్రభాతవార్త :** ఈ యాసంగిలో వేరుశనగ పంట అధిక దిగుబడులు సాధించిందని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ రైతు వ్యవసాయ పొలంలోని వేరుశనగ కుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ రైతులు యాసంగిలో వ్యవసాయశాఖ సలహాలు, సూచనలు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించిందని తెలిపారు. వేరుశనగ పంటలకు జిప్సం ఎరువుల వాడకంపై రైతులకు పూర్తిగా అవగాహన కల్పించడం వల్ల ఎకరానికి సరాసరి 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి సాధించిందని తెలిపారు. రైతులు తమ ఇష్టానుసారంగా ఎరువులు వాడకుండా వ్యవసాయశాఖ సూచనల మేరకు వాడినట్లయితే అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సురెంద్రరెడ్డి, రైతులు ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## వాహనాలు నడిపే టప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి...

**జిల్లా రవాణా శాఖాధికారి అవినాష్ నాయక్ చౌహన్**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 29, ప్రభాతవార్త :** వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా రవాణా శాఖాధికారి అవినాష్ నాయక్ చౌహన్ వాహన దారులకు సూచించారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్స వాలు భాగంగా సోమవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయం వనపర్తి నుండి ఎకో పార్క్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ముఖ్యమైన కూడలిలో హెల్మెట్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ కర పత్రాలను కూడా పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా జిల్లా రవాణా శాఖాధికారి అవినాష్ నాయక్ చౌహన్ మాట్లాడుతూ రహదారి పై వెల్లెట ప్పుడు హెల్మెట్ లేకుండా వాహనములు నడుపరాదని, ఇంకా రహదారి పై వెళ్లేటతీసుకోవలిసిన జాగ్రత్తలు మరియు బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మరియు వాహన షోరూం వారు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ కోదండరాం విమర్శించే స్థాయి కేటీఆర్‌ది కాదు: యం ఏ.ఖాదర్ పాష

**వనపర్తి టౌన్, జనవరి 29, ప్రభాతవార్త :** మాజీ మంత్రి కేటీఆర్ మానసిక స్థితి బాగోలేదని ఆయనను ఎర్రగడ్డ పిచ్చి ఆసుపత్రిలో చేర్చాలని తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను పదేళ్ల మర్చిపోయి రాష్ట్రాన్ని నిలువు దోపిడి చేసిన కేసీఆర్ కుటుంబం నేడు అధికారం కోల్పోయేసరికి ఆగం ఆగం అయ్యి అరుస్తున్న తీరును చూసి తెలంగాణ ప్రజలు నవ్వుతున్నరని అన్నారు. నాడు తెలంగాణ కోసం కొట్లాడిని ఉద్యమ కారులను రాష్ట్రం ఏర్పడ్డక అవమానించి అనిచివేసిన చరిత్ర కేసిఆర్ కుటుంబానిది అని సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ప్రజలు ఓడించిన బుద్ధి మారలేదని అన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన టిజేఎస్ అధినేత కోదండరాం నియమకం పట్ల దిగజారుడు వ్యాఖ్యలు చేయడం శోచనీయం అని అన్నారు. ప్రొఫెసర్ కోదండరాం అనుభవం ఉన్నంత, కేటీఆర్ వయసు లేదు అని అన్నారు. తెలంగాణ కోసం కోట్లాడిన ఉద్యమ కారులను ప్రజా ప్రభుత్వం గౌరవిస్తుంటే బిఆర్ఎస్ నేత కేటీఆర్ అసూయతో అవాకులు చెవాకులు మాట్లాడుతున్నరాని అన్నారు. తెలంగాణ పేరును తన పార్టీ నుండి తొలగించుకోని దేశ్ కి నేత కేసీఆర్ అని ప్రగల్బాలు పలికి తెలంగాణ సంపదతో ఇతర రాష్ట్రాలకు రాజకీయ యాత్రలు చేసి దుబారా చేసిన వాళ్ళు నేడు తెలంగాణ, తెలంగాణ అని కలవరం చెందుతున్న తీరును ప్రజలు గమనిస్తున్నరని వారికి తెలంగాణ ప్రజలు ఎప్పుడో దూరం అయ్యారని, ప్రజలు ఎన్నికల్లో ఓడించిన తరువాత కేటీఆర్ కు తెలంగాణ గుర్తుకు వచ్చిందని ఆరోపించారు. కేటీఆర్ తీరు మర్చుకోక పోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయం అని జోస్యం చెప్పారు.



### నియోజకవర్గ సమస్యలపై రాష్ట్ర మంత్రులను కలిసిన

# ఎమ్మెల్యే, మాజీ డిసిసిబి అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కుంభం శివకుమార్‌రెడ్డిలు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు భూ సమస్యలతో పాటు, బలహీన వర్గాలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయాలంటూ మంత్రిని ఎమ్మెల్యే కోరారు.

**నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించండి...**

జిఓ 69ను అమలు చేసి నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి కోరారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి సిడబ్ల్యుసి సభ్యుడు, వంశీచందర్‌రెడ్డితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరిలతో కలిసి మంత్రిని కలిశారు. ప్రజల ఆకాంక్ష మేరకు వెనుకబడిన నారాయణపేట జిల్లా రైతాంగానికి సాగునీటి ప్రాజెక్టు నిర్మించి, సాగునీరు అందించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, అన్ని అనుమతులు రాగానే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యేలు



గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటిని కలిసిన నారాయణపేట ఎమ్మెల్యే

## విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: నర్వ ఎస్సై

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, పోలీస్ కళాబృందం వారి ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యవస్థ, సైబర్ నేరాల, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం వల్ల ఏర్పడే అనర్థాలు, రోడ్డు భద్రతా నియమాలు, సమయపాలన, అమ్మాయిలు మహిళలపై వేధింపులు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. లీడర్‌షిప్ లక్షణాలు, గోల్ సెట్టింగ్ చదువుపై శ్రద్ధ, రోడ్డు భద్రతా నియమాలు, పౌరుల హక్కులు మొదలగు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కుర్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని చదువుతోపాటు వివిధ రకాల పుస్తకాలను చదవాలని నాలెడ్జ్ పెంచుకోవాలని బుక్స్ చదవడం వల్ల నాలెడ్జ్ పెరుగుతుందని, విద్యార్థులు ఇంటికెళ్లిన తర్వాత సెల్‌ఫోన్‌లతో ఎక్కువ సమయం వృధా చేసుకోవడం జరుగుతుందని, వాటివల్ల అనర్థాలు ఎక్కువ జరుగుతున్నాయని కావున సెల్‌ఫోన్‌లకి దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ కనబర్చాలని తెలిపారు. మహిళలు, ఆడపిల్లలను ఎవరైనా లైంగికంగా మానసికంగా, శారీరకంగా వేధించిన, ర్యాగింగ్ చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందని అలాంటి వారు ఉంటే ధైర్యంగా పోలీసులకు తెలపాలని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఇంటికెళ్లే సమయంలో బస్టాండ్లలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎవరిని నమ్మరాదని, ఎవరిపైన అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే ప్రస్తుతం సైబర్ నేరాల విపరీతంగా పెరుగుతున్నాయని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తోటి మిత్రులకు ఇరుగు పొరుగు వారికి సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930, డయల్ 100 ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సీటుబెల్టు ధరించాలని, అధిక స్పీడ్‌తో వాహనాలు నడిపించరాదని తమ తలిదండ్రులకు, విద్యార్థులు తెలియపరచాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, రుఖ్యానాయక్, కళ్యాణి, హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు బృందం

## అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో సత్తా చాటిన విద్యార్థులు..

**ఓరల్ గ్రాండ్ ఛాంపియన్షిప్ సాధించిన గాడ్స్ ఆన్ వారియర్స్**

**కొత్తకోట, జనవరి 29, ప్రభాతవార్త :** ఈ నెల 27,28 తేదీలలో హైదరాబాద్ మహానగరంలోని దిల్ సుఖ్ నగర్ లో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రెండవ అంతర్జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీలు వరల్డ్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ దేశాలకు రాష్ట్రాలు చెందిన దాదాపు 3800 విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు కొత్తకోట కు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే డు ఇండియా చెందిన 30 మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి బంగారు వెండి పథకాలు సాధించారని అదేవిధంగా ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించడం జరిగిందని క్లబ్బు ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. వీరిలో కతాస్ విభాగంలో అండర్ 06 సంవత్సరాల విభాగంలో షాజ్ అలీ, సాద్ అలీ, అయాన్ రెడ్డి, వెండి పథకం అండర్ 10 విభాగంలో లోకేష్, అక్షిత, అశ్విని, ముస్రాఫ్, వేణు, ప్రసాద్ బంగారు పథకాలు అండర్ 12 సంవత్సరాల వైశ్విక్, తేజ్, వేణు, నవ్య, నందన్, భాను, ప్రకాష్, సోహెల్, ఏం విజయ్ కుమార్, దుర్గా ప్రసాద్, ఎండి హర్షద్, ఆర్ తరుణ్ బంగారు పతకం, రుమాన్, జయంతి రెడ్డి, వెండి పథకాలు అదేవిధంగా కుమ్మితే విభాగంలో అండర్ 07 సంవత్సరాల విభాగంలో వెంకట్రావు బంగారు పతకం అండర్ 09 సంవత్సరాల బాలికల విభాగంలో యోగేశ్వరి అన్విత బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. అండర్ 10 సంవత్సరాల విభాగంలో రిత్విక్ గౌడ్ బంగారు పతకం అండర్ 12 సంవత్సరాల విభాగంలో రాఘ వేంద్ర బంగారు పతకం సాధించారని తెలిపారు. ఇదేకాక ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్షిప్ శిక్షణ ఇచ్చిన జాఫర్, సాధిక్, జి హరీష్ యాదవ్, ఎండి ఇంతియాజ్ మాస్టర్లను ముఖ్య అతిథుల ద్వారా ప్రత్యేకంగా శాలువా మెమోటోల ద్వారా వారిని అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో క్లబ్బు సీనియర్ కరాటే మాస్టర్ ఇఫ్తార్, పృధ్వీరాజ్, సోను, రఫ్ యుల్లా ఖాద్రీ, వెంకటేష్, బి కురుమూర్తి యాదవ్, శివరాజ్, జే.సుమ, ఎండి జంగిర్ తదితరులు పాల్గొన్నారు.




బంగారు వెండి పతకాలు సాధించిన విద్యార్థులు

## జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి..

**ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆది డిమాండ్**

**అమరచింత, జనవరి 29, ప్రభాతవార్త:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో అమరచింత మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి, విద్యారంగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం అమరచింత మండల కేంద్రంలోని కార్యకర్తల సమావేశం అనంతరం ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆది మాట్లాడుతూ.. అమరచింత మండల కేంద్రంలోని గత ప్రభుత్వంలో అనేకసార్లు జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసిన ప్రభుత్వం పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు. నూతన ప్రభుత్వంలో నైనా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా గత సంవత్సరం కాలంగా వసతి గృహాలు, గురుకులాలు, కెజిబివిలు, ఆశ్రమ పాఠశాలు సంబంధించిన మెస్ బిల్లులు సుమారు 6,300 కోట్లు పెండింగుల్లో ఉన్నాయి వాటిని విడుదల చేయలేదు, గత ప్రభుత్వంకు అనేక సందర్బాల్లో విడుదల చేయాలని కోరిక ఫలితం లేకుండా పోయింది. అలాగే గత ప్రభుత్వం పెంచిన మెస్ ఛార్జీలు కూడా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. వార్డెన్లు అప్పులు తీసుకుని వచ్చి హాస్టల్స్ నడుపుతున్నారు. దీనివల్ల పెద్ద విద్యార్థులు చదువుకుంటున్న వసతిగృహాలకు నాణ్యమైన భోజనం, వసతి కల్పించడం లేదు. అలాగే గత ఆరు సంవత్సరాల నుండి రాష్ట్రంలో 7200 కోట్ల స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్ మెంట్స్ విడుదల కాలేదు. అనేక సార్లు ఉద్యమాలు చేసిన గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. 14 లక్షల మంది విద్యార్థులు తమ ఫీజులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఈ ప్రభుత్వం ఈ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన అమలు చేయాలని, ఖాళీగాఉన్న 26వేల టీచర్‌పోస్టులు భర్తీచేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈసమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె రాఘవ, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యాక్షులు రమేష్, చందు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి..

**తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా.. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్‌కు వినతి పత్రం**

**అమరచింత జనవరి 29 ప్రభాతవార్త:** అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండు చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు అజయ్, సిపిఎం జిల్లా నాయకులు బి.వెంకటేశ్ మాట్లాడుతూ అమరచింత మండల కేంద్రంలోని దుంపాయికుంట సర్వే నెంబర్ 586,587 ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలిచ్చి 27 ఏళ్ల గడుస్తున్నా ఇప్పటివరకు పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు చూపడం లేదని వారన్నారు. గత ప్రభుత్వం పేదలకు స్థలాలిస్తామని ఎమ్మెల్యే , కలెక్టర్, తాహసిల్దార్ హామి ఇచ్చిన ఎన్నికల కోడ్ సాకుతో వాయిదా వేశారని వారు తెలిపారు. అలాగే పట్టాలు పొందిన లబ్ధిదారులు గుడిసెలు వేసుకుని రెండేళ్ల నివాసముంటున్న లబ్ధిదారులకు కనీస సౌకర్యాలు కల్పఇంచడంతో గత ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వారన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు చూపాలని అలాగే లబ్దిదారులకు ఇండ్లు నిర్మించుకోవడానికి 5 లక్షలు ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులైన ప్రతి పేదవానికి ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. లేనిచో లబ్దిదారులతో కలిసి పోరాటాలను ఉధృతం చేస్తామని వారన్నారు. అనంతరం తాహసిల్దార్ షేక్ చాంద్ భాషకు వినతిపత్రం అందజేశారు.




అమరచింత తాహసిల్దార్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా



తాహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

## నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం....



**వనపర్తి ప్రతినిధి, జనవరి 29, ప్రభాతవార్త :** వనపర్తి మండలం రాజపేట పెద్దతాండ (ఆర్)లో నూతన అంగన్వాడీ భవనము మరియు గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయరాములు నాయక్, ఉప సర్పంచ్ కాత్రావత్ రేవతమ్మ, కురుమూర్తి, గంధం నాగరాజు, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## రేపు ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం

**ఉప్పునుంతల, జనవరి 29 ప్రభాతవార్త :** ఉప్పునుంతల మండల సర్వసభ్య సమావేశం రేపు ఉదయం 10.30 గం.లకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు తెలిపారు. ఇట్టి సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## నూతన యూత్ కమిటి ఎన్నిక

**మూసాపేట, జనవరి 29 ప్రభాతవార్త :** మూసాపేట మండల పరిధిలోని కొమిరెడ్డిపల్లి గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి చంద్రశేఖర్ మండల యూత్ అధ్యక్షులు సూదిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బూత్ యూత్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. 59వ బూత్ యూత్ ప్రెసిడెంట్‌గా బగ్గి లక్ష్మణ్ 60వ బూత్ యూత్ ప్రెసిడెంట్‌గా బోయ వెంకటేష్‌లను ఎన్నుకోవడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ విజయంలో యువత కీలక పాత్ర పోషించాలని పార్టీకోసం కష్టపడాలని తను ఎన్నికల్లో కాంగ్రెస్ పార్గీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని రానున్న పార్లమెంట్‌ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిని మెజార్టీతో గెలిపించాలని మండలపార్టీ అధ్యక్షులు శెట్టి చంద్రశేఖర్ కోరారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బగ్గిబాలరాజు, నాయకులు నిరంజన్, బూత్ కమిటి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు మండలాల్లో ఎమ్మెల్యే పర్యటన..

**నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం**

**గోపాలపేట, జనవరి29, ప్రభాతవార్త:** గోపాలపేట, రేవల్లి మండలాల్లో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సుడిగాలి పర్యటన చేయనున్నారు. ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్న గ్రామ పంచాయతీభవనాలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రెండు మండలాల ఇంచార్జ్ సత్యశిలారెడ్డి తెలిపారు. గోపాలపేటమండలం బుద్దారం గ్రామపాటిగడ్డలో ఏడుగంటలకు. గ్రామ పంచాయతీ నూతనభవనం ప్రారంభం పొలికేపాడు గ్రామం ఆ ముదాల కుంట తండాలో 7గంటల30నిమిషాలకు నూతన గ్రామపంచాయతీభవనం ప్రారంభం అదేవిధంగా రేవల్లి మండలంలోని గొల్లపల్లిగ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం ఎనిమిదిగంటలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరు కావలసిందని వారు కోరారు.

## ప్రజావాణికి దరఖాస్తులు నిల్..



**ఉప్పునుంతల, జనవరి29 ప్రభాతవార్త:** స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఎలాంటి దరఖాస్తులు రాలేదని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు విన్నవించుకున్న పరిష్కరించే వారే లేకపోవడంతో తాము మండలకేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కన్నా జిల్లాకేంద్రంలో నిర్వహించే ప్రజాపాలనలో తమగోడు విన్నవించుకుంటామని మండల ప్రజలు తెలుపుతున్నారు. ఉప్పునుంతలలో నిర్వహించే ప్రజావాణికి దరఖాస్తులు రాకపోవడం ఇదే కారణమని వారు వాపోయారు. కానీ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి స్థానిక తహసిల్దార్ తబితారాణి, ఉప తహసిల్దార్ సరస్వతి, ఎంపిడిఓ సూపరింటెండెంట్ అమిదొద్దిన్, ఐసిడిఎస్ సూపంర్వైజర్ బిపాషా, మండల వ్యవసాయ విస్తీర్ణాధికారిణి మంజుల, ఐకెపి ఎపిఎం సైదులు, పశువైద్యాధికారి డా.నరెందర్ పాల్గొన్నారు.

## పథకాల అమలుపై దృష్టి సారించాలి..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఉపకార వేతనాలపై దృష్టి సారించాలని, గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం సైతం అర్హులైన అర్హులందరికి ప్రిమెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు వచ్చేలా చూడాలన్నారు. ఉద్యోగుల బయోమెట్రిక్‌ను ఆయన సమీక్షిస్తూ అధికారులు, సిబ్బంది అందరూ సకాలంలో కార్యాలయానికి వచ్చేలా చూడాలని, ఉదయం 10.30 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు తప్పనిసరిగా కార్యాలయ విధులకు హాజరు కావాలని, సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అన్నిశాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై సిపిఓకు నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి

## ●వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి టౌన్, జనవరి 29,ప్రభాతవార్త:** నులిపురుగుల వల్ల ఎదిగే పిల్లలలో రక్తహీనత వచ్చి అనేక సమస్యలకు గురి అవుతారని అందువల్ల నులు పురుగుల నివారణకు ఫిబ్రవరి 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఫిబ్రవరి 12 నాడు 1,19 సంవత్సరాల వయస్సు గల ప్రతి పిల్లలకు నివారణ మందు తినిపించే విధంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లైన్ డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి హాల్లో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ఫిబ్రవరి 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రతి చిన్నారికి నులి పురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రను తప్పక వేయించాలన్నారు.1 నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆరేళ్ల నిండి 19 ఏళ్ల వయస్సు గల వారికి పాఠశాలలు, కళాశాలలో,హాస్టల్,గురుకుల,కే.జి.బి.వి ల్లో మందును దగ్గరుండి తినిపించాలి అని ఆదేశించారు.1 నుంచి 2 సంవత్సరాల చిన్నారులకు 200 మి.గ్రా(సగం) మాత్ర,2 నుంచి 3 సంవత్సరాల వయస్సు వారికి 400 మి.గ్రా ఒక మాత్ర చూర్ణం చేసి తినిపించాలి.2 నుంచి 19 సంవత్సరాల బాల బాలికలకు 400 మి.గ్రామ ఒక మాత్ర నమిలి మింగాల్సి ఉంటుంది.ఒకవేళ ఫిబ్రవరి 12 వ తేదీన ఏదేని మాత్రలు తినిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో ఆశా వర్కర్లు,అంగన్వాడీ టీచర్లు పాఠశాల,కళాశాల స్థాయిలో సంబంధిత ఉపాధ్యాయులు,అధ్యాపకులు విద్యార్థులందరికీ మాత్రలు తినిపించే విధంగా బాధ్యతలు తీసుకొని కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ ఎల్బీ సంచిత్ గంగ్వార్,అదనపు కలెక్టర్ రెవెన్యూ తిరుపతిరావు,ఆర్డీవో ఎస్ పద్మావతి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయచంద్ర మోహన్,డా.రవి శంకర్,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నులిపురుగుల నివారణ గురించి ఎక్స్ప్లెయిన్ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయచంద్ర

## సర్పంచులకు సన్మానం



**వీపనగండ్ల, జనవరి 29,ప్రభాతవార్త:** మండలంలోని 14 గ్రామ పంచాయతీల కు గాను 13 మంది సర్పంచులు హాజరు కావడం జరిగింది వారికి ఎంపీడీవో కతాలప్ప ఎంపీపీ కమలేశ్వరరావు ఎమ్మార్వో వరలక్ష్మీ తదితర ప్రభుత్వ ఉద్యోగుల సర్పంచ్లకు శాలువలతో సన్మానం చేశారు ఈ సందర్భంగా ఎంపీడీవో కతాలప్ప మాట్లాడుతూ సర్పంచ్ల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా వారికి సన్మాన కార్యక్రమం మండల సర్వసభ్య సమావేవం సందర్భంగా నిర్వహించడం జరిగిందని అయితే గ్రామాలలో వారి సేవలను ఆయన కొరియాడుతూ ప్రజలకు అందుబాటులోఉండి అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి పనుల్లో నిమగ్నమై ప్రభుత్వం ఇచ్చి న కార్యక్రమాలను పూర్తి చేస్తూ మాకు సహకరించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు సర్పంచులు నుండి వీపనగండ్ల సర్పంచ్ విపనగండ్ల సర్పంచ్ వి నరసింహా రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్లుగా తమ బాధ్యతలను నిర్వర్తించడంలో మండల అధికారులు పంచాయతీ కార్యదర్శులు మాకు పూర్తిగా సహకరించారని ఒకరి మధ్య ఒకరం కోఆర్డినేషన్తో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఈ ఐదు సంవత్సరాల పదవీకాలంలో తాము కృషి చేయడం జరిగింతని ఈ సందర్భంగా ఆయన తెలిపారు అధికారుల అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు గుండ్ల భాస్కర్ రెడ్డి రాము కోఆప్షన్ సభ్యులు సర్పంచులు ఆర్ మౌలాలి రవీందర్ రాధా పద్మ మానస మౌలాలి అంజయ్య నాయక్ పాల్గొన్నారు .

## భారీగా కర్నాటక మద్యం పట్టివేత



**అలంపూరు జనవరి29 ప్రభాతవార్త:** అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం బొంకూరు గ్రామ శివారులోని సోమవారం చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్ సీఐ పటేల్ బానోత్ తెలిపిన వివరాల ప్రకారం సాధారణ వాహన తనిఖీల్లో భాగంగా బొంకూరు గ్రామానికి చెందిన వడ్డే రమేశ్ ఇండికా విస్తా కారును తనిఖీ చేయగా కారులో 55 మద్యం కాటన్లు 450 లీటర్లు పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం కర్నాటక మద్యంగా గుర్తించారు. మద్యం విలువ లక్షరూపాయలు విలువ ఉంటుందని సీఐ తెలిపారు. పట్టుబడిన మద్యాన్ని కారును అలంపూరు ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్యకార సొసైటీ ఏర్పాటు



మత్స్యకార ధ్రువీకరణ పత్రం అందజేస్తున్నదృశ్యం

**ఖిల్లాఘనపురం, జనవరి29,ప్రభాతవార్త :** మండల పరిధిలోని మలికిమ్యాన్ పల్లి గ్రామంలో నూతనంగా మత్స్యకార సొసైటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికార రెహమాన్ తెలిపారు.ఆరు మాసాల క్రితం 30 మందికి స్కిల్ టెస్ట్ ఏర్పాటు చేశామని 24 మంది స్కెల్ టెస్ట్ లో పాస్ అయ్యారని 24 మందితో నూతనంగా పొసైటీ అధ్యక్షులు సాయిలతోపాటు ఇతర సభ్యులకు నూతన సొసైటీ ధ్రువీకరణ పత్రము అందజేసినట్లు ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలోపొసైటీ సభ్యులుబిక్షపతివెంకటేష్‌నవీన్లు పాల్గొన్నారు.

## టోల్‌ప్లాజా అధికారికి వినతి



అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**అడ్డాకుల, జనవరి 29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో హైవే వెంబడి ఉన్న రెండు వైపులా సర్వీస్ రోడ్లపై గత సంవత్సర కాలంనుంచి లైట్లు వెలగక పోవడం గురించి, సర్వీస్ రోడ్లపై ఉన్న మట్టిని తొలగించాలని, అడ్డాకుల ఎస్సీ కాలనీకి చెందిన యువకులు టోల్‌ప్లాజా కార్యాలయంలో అక్కడున్న అధికారికి వినతి పత్రం ఇచ్చారు. సర్వీస్ లైట్ల గురించి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని,ఎక్కడ జాప్యం జరుగుతుంది సమస్య ప్లాజా వాళ్లదా లేదా ఎలక్ట్రిసిటి వాళ్లదా అనిపలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొందంగా సమస్యను క్లియర్ చేయాలని కోరారు. లేని ఎడల పై ఆఫీసర్‌కు ఫిర్యాదు చేస్తామని అలాగే ఎన్‌హెచ్ 44 అధికారులు, మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వాళ్లతో చెప్పడం జరిగింది. అలాగే ఫ్లై ఓవర్ కింద ఉన్న మట్టిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో అడ్డాకుల గ్రామ ఎస్సీ కాలనీ యువకులు మునగల బాలరాజు, మునగల శేఖర్, మునగల సుదర్శన్, ఎం.ప్రసాద్, మచ్చని ప్రశాంత్, మునగల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

### ●మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘుపతి రాథోడ్

**లింగాల, జనవరి29 ప్రభాతవార్త:** అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రఘుపతి రాథోడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తూ ఎమ్మెల్యేగా గెలుపొందిన డా. చిక్కుడు వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ మంత్రి పదవి ఇచ్చినట్లయితే అచ్చంపేట మారుమూల ప్రాంతం చురుకుగా అభివృద్ధి చెందుతుందని కోరారు.కార్యక్రమంలో కావేటి విష్ణు, రమేష్, బాల నారాయణ, సంతోష్ రాథోడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రఘుపతి రాథోడ్

# ఉపాధి హామీ పథకంలో పనిచేసిన డబ్బులు ఇవ్వండి

### ●సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆవేదన..



**వీపనగండ్ల, జనవరి 29,ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకంలో గ్రామ పంచాయతీ కి వచ్చే డబ్బులు ఇవ్వండి అని వీపనగండ్ల మండల సర్వేసభ సమావేశంలో సర్పంచ్లు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమావేశం ఎంపీపీ కమలేశ్వరరావు అధ్యక్షతన జరగగా ఆయన అనుమతితో సర్పంచులు మాట్లాడుతూ ఇప్పటివరకు తమ చేతి నుండి గ్రామపంచాయతీకి డబ్బులు పెట్టడం జరిగిందని ఒక రెండు రోజుల్లో తమ పదవీకాలం పోతుంతని మేము చేసిన పనులకు డబ్బులు ఎవరిని అడగాలి అని సంపత్ రావు పల్లి సర్పంచ్ రామేశ్వరావు సంగినేనిపల్లి సర్పంచ్ మౌలాలి వల్ల భాపురం సర్పంచ్ రవీందర్ తదితర సర్పంచులు అధికారుల దృష్టికి తెచ్చారు. అయితే ఈ సందర్భంగా మండల ఉపాధి అధికారి శేఖర్ గౌడ్ ఎంపీడీవో కథలప్ప సమాధానం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం నుండి ఉపాధి హామీ డబ్బులు రావడం ఇబ్బందిగా జరుగుతుందని ప్రభుత్వం రిలీజ్ చేసిన ఎమ్మెల్యే గ్రామపంచాయతీ అకౌంట్లో జమవుతాయని వారు తెలిపారు.ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీళ్లు పోయిస్తున్నామని ట్రాక్టర్లకు అప్పులు తెచ్చి డీజిల్ పోయిస్తున్నామని వారు ఆవేదన చెందారు ఇప్పుడు అప్పుడు అద్దు కాలం వెలదీస్తున్నారు.తప్ప తమ చేతి నుండి పెట్టిన డబ్బులు మాత్రంరావడం లేదని అన్నారు.వీటితోపాటు వేసవిలో త్రాగునీటి సమస్య ఉత్పన్నంకాకుండా చూడాలనిసంబంధిత అధికారులకు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.ఈ సమావేశంలో ఎమ్మార్వో వరలక్ష్మి తుంకుంట సింగిల్విండో చైర్మన్ రామన్‌గౌడు వివిధశాఖల అధికారులు హాజరయ్యారు కాగా ఈ సమావేశానికి ఐదు మంది ఎంపీటీసీలు గైరాజర్ అయ్యారు గోవర్ధనగిరిపుల్లర్చర్ల వల్ల భాపురం సంగినేనిపల్లి బొల్లారం వారు రాలేదు.

## సాదాసీదాగా మండల సభ



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

**చిన్నచింతకుంట, జనవరి 29 ప్రభాతవార్త:** ప్రతి మూడు నెలలకు ఒక మారు జరిగే మండల సర్వసభ్య సమావేశం సోమవారం సాదాసీదాగా జరిగింది. మండల మహిళా సమాఖ్య సమావేశ హాల్లో ఎంపిపి హర్ష వర్ధన్‌రెడ్డి అధ్యక్షతన మండల సభ ప్రారంభమైంది. ఈ మండల సభకు వివిధ శాఖల అధికారులు తమ ఎజెండాలతో సభకు హాజరయ్యారు. మండల విద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ తమ ఎజెండా చదివి వినిపిస్తుండగా ఉంద్యాల ఎంపిటిసి నెల్సన్ అడ్డు తగిలి గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల భవనం అసంపూర్తిగా ఉందని కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నేటికి పూర్తి కాలేదని వేరే కాంట్రాక్టర్‌కు పని అప్పజెప్పాలని విద్యాధికారిని నిలదీశారు. ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలకు డబ్బులు ఏ బ్యాంకు ఖాతాలో వేస్తున్నారో తెలియక కొందరు కూలీలు ఆఫీస్ చుట్టు తిరుగుతున్నారని దీనిపై ఏపిఓ దృష్టి సారించాలని విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి సూచించారు. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కూలీలకు అవగాహన కల్పిస్తామని ఏపిఓ నవీన్‌కుమార్ సభలో తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద ప్రతి గ్రామానికి స్వచ్ఛమైనత్రాగునీరు అందిస్తున్నామని ఈ వేసవిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రఘు సభలో తెలిపారు. రామన్‌పాడ్ పంపింగ్ నుంచి కాకుండా బుగ్గపల్లి నుంచి ఫిల్టర్ చేసిన స్వచ్ఛమైన నీరును సరఫరా చేస్తున్నామని ఇప్పటికీ గ్రామాలలో మిషన్ భగీరథ నీటిని తాగడం లేదని త్వరలో ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. గ్రామాలలో చేతిపంపులు రిపేర్లు చేయించాలని దమగ్నాపూర్ గ్రామ సర్పంచ్ హనుమంత్‌రెడ్డి సభదృష్టికి తీసుకురాగా త్వరలో చేతి పంపుల రిపేరుకు గాను ప్రైవేట్‌గా మెకానిక్‌ను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. మిషన్ కాకతీయ కింద గొలుసుకట్టు కాలువలలో ప్రభుత్వం నిర్దేశించిన స్థలంలో స్లూయిస్ నిర్మించాలని అలా కాకుండా ఒక రైతుకు లబ్ది చేకూర్చేలా కాలువలకు అడ్డుగా చెక్‌డ్యాం నిర్మించడం వల్ల చాలా మంది రైతులు నష్టపోతారని సభలో ప్రజాప్రతినిధులు మిషన్ కాకతీయ అధికారిని నిలదీశారు. గొలుసుకట్టు కాలువలకు ఆనుకుని ఉన్న ప్రతి రైతుకు లబ్ది చేకూర్చేలా పనులు జరగాలని ప్రజా ప్రతినిధులు అధికారులకు సూచించారు. మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ప్రశాంతంగా జరిగింది.జనవరి 31తో సర్పంచ్‌లపదవికాలం ముగియ నుండగా సర్పంచ్‌లకు చివరి మండల సభ నిలిచింది. అనంతరం ప్రతి గ్రామ సర్పంచ్ తాము అధికారం చేపట్టిన నాటినుంచి అనుభవాలను సభలో వెల్లడించారు. ఈ మండల సభలో జడ్పీటిసి వట్టెం రాజేశ్వరి రాము,కోఆప్షన్‌మహమూద్, మార్కెట్ వైస్ చైర్మన్ దశరథరెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాస్‌రెడ్డి,ఆయాశాఖలఅధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారస్తులకు టీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది

### ●వైస్ ఎంపిపి వెంకటాచారి, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న టీఆర్ఎస్ నాయకులు

**బాలానగర్, జనవరి29 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రంలో గత 40 సంవత్సరాల నుండి రోడ్డుకు ఇరువైపులా పండ్ల దుకాణాలు, పాన్‌షాపులు, టిఫిన్ సెంటర్, కూరగాయల షాపులు, మిర్చి బండ్లు, చిన్న చిన్న తోపుడు బండ్లు పెట్టుకొని చాలా మంది చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారని, ఈనెల 5వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో వారికి ఎలాంటి సంబంధం లేదని, రోడ్డుమీద వెళ్తున్న డిసిఎం ఢీకొట్టడం వలన జరిగిన సంఘటన బాధాకరమని వైస్ ఎంపిపి వెంకటాచారి, టీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. రోడ్డు వెడల్పులో భాగంగా చిరు వ్యాపారులు వారి స్థలాలు కోల్పోవడం జరిగిందని, వారందరూ పూల దుకాన్లు, చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయంగా స్థలం చూపించకుండా వాళ్ల వ్యాపారాలను తొలగించడం, చాలా బాధాకరమని అన్నారు. గతంలో మాజీ మంత్రి, మాజీ శాసనసభ సభ్యులు లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకుపోగా జీఎంఆర్ వారితో మాట్లాడి వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడడం జరిగిందని, బ్రిడ్జి వేసేటప్పుడు ఆలోచించేది పోయి ఇప్పుడే వారి పొట్ట కొట్టడం సరైనది కాదని, వారిని ఇబ్బంది పెట్టొద్దని జీఎంఆర్ పోలీస్ వారికి విజ్ఞప్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకటాచారి, బిఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రవికుమార్, గణేష్‌గౌడ్, చక్రంచారి, వార్డు సభ్యుడు అప్సర్‌ఖాన్, దేవల్లి శ్రీనివాస్, వినోద్, చక్రధర్, సుధాకర్ పాల్గొనడం జరిగింది.

# బాల్య వివాహాలు చేస్తే నేరం

### ●గద్వాల జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్



ఎంవి ఫౌండేషన్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

**గద్వాల ప్రతినిధి, జనవరి29 ప్రభాతవార్త:** జిల్లాలో 18 సంవత్సరాల్లోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరంలోపు మగపిల్లలకు వివాహాలు చేయడం, చట్టరీత్యా నేరమని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని సమీకృత కార్యాలయాల సమావేశ హాలులో ఎంవి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వద్ద మాకు పెళ్లి, బడికే పోతాం మేం అనే పోస్టర్‌ను అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే వారి తల్లిదండ్రులపై, వారికి సహక రించిన, ప్రోత్సహించిన, పెళ్లి చేసుకున్న వరుడు శిక్షకు అర్హులన్నారు. ఇందుకు గాను 2 సంవత్సరాల వరకు జైలుశిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు. అటువంటి కేసులు ఏమైనా మీ దృష్టికి వస్తే పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్1098కు కాల్‌చేసి సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, డిపిఆర్ఓ చెన్నమ్మ, జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహ, ఎంవి ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.సాయికుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిర్లింగాల మహా పడిపూజ



**కోయిల్‌కొండ, జనవరి 29ప్రభాతవార్త:** మండల పరిధిలోని పారుపల్లి గ్రామంలో సోమవారం కావలి రవిలక్ష్మి దంపతులు నిర్వహించిన శివస్వాముల మహాపడిపూజ కార్యక్రమం వైభవోపేతంగా, కన్నుల పండువగా కొనసాగింది. కార్యక్రమానికి శివస్వాముల గురుస్వామి కానాయపల్లి శివ కుమార్ స్వామి హాజరై శివస్వాములు నిర్వహించే పూజా విధానంపై స్వాములకు దిశా నిర్దేశం చేస్తూ జ్యోతిర్లింగాల మహాపడిపూజ కార్యక్రమాన్ని కొనసాగించారు. శివుడికి అభిషేకం నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివస్వాములు నిర్వహించిన జ్యోతిర్లింగాల మహా పడిపూజ కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున శివస్వాములు తరలి రావడమే కాకుండా ఇతర మండలాల నుంచి సైతం శివ స్వాములు భారీగా తరలి వచ్చారు. శివస్వాముల భజన సంకీర్తనలతో ఆడిపాడారు. దీంతో పారుపల్లి గ్రామం అంతా శివనామస్మరణతో మారుమోగిపోయింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కోయిల్‌కొండ నుంచి గురు స్వాములు యాదయ్య, వీరేష్‌ల ఆధ్వర్యంలో స్వాములు భారీ సంఖ్యలో పారుపల్లి గ్రామానికి చేరుకుని శివస్వాముల మహా పడిపూజలో పాల్గొన్నారు.

## సమన్వయంతో అభివృద్ధి చేసుకుందాం!



**అలంపూర్ జనవరి29, ప్రభాతవార్త:** గ్రామాలను అందరం కలిసి సమన్వయంతో అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బొంకూరు, మెన్నిపాడు గ్రామాలలో మన ఊరు మన బడి కింద నూతనంగా నిర్మించిన అదనపు తరగతులు, సైన్స్ కింద నూతనంగా నిర్మించిన అదనపు తరగతులు , సైన్స్ ల్యాబ్, భోజనశాల టాయిలెట్ బ్లాక్స్‌ను రిబ్బన్ కట్టి చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ చల్లా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కి కృషి చేసిన గ్రామ సర్పంచి బెక్కం శ్రీలతను అభినందించారు. అలంపూర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి సంక్షేమంలో ముందు ఉంచడమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సర్పంచుల సంఘం అధ్యక్షులు సురవరం లోకేశ్వర్‌రెడ్డి, బజారన్న,బెక్కం భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, రజాక్,వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# నూతన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన జిల్లా జేపీసీ నేతలు



**ఇటిక్యాల జనవరి29 ప్రభాతవార్త:** గవర్నర్ కోటా కింద నూతన ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ ఆచార్య కోదండరాం ను హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో జోగులాంబగద్వాల్ జిల్లా జేపీసీ నేతలు ఆలూరు ప్రకాష్‌గౌడ్. శాంతినగర్ రామ్మోహన్ రావు. బీజాపూర్ ఆనంద్ . గోపాల్ రావుతదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఫభుత్వం ఎమ్మెల్సీగా ఎంపిక చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. ఈసందర్భంగా నూతన సమావేశమై గద్వాల్ నియోజకవర్గంలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్ భూ నిర్వాసితుల సమస్యలపై చర్చించారు. అలాగే అలంపూరు నియోజకవర్గంలోని ఆర్డీఎస్ సాగునీటి ప్రాజెక్టు ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆర్డీఎస్ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో సాగునీరుఅందించేలా రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని ఎమ్మెల్సీనప్రొఫెసర్ కోదండరామ్‌కు నేతలు వివరించారు జిల్లా జేపీసీ నేతలు సూచించిన సమస్యలపై సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ హామి ఇచ్చినట్లు వారు తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకునితెలంగాణ కోసం పోరాడిన ప్రొఫెసర్ కోదండరాం`కు ఎమ్మెల్సీ పదం ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సార్‌కు విద్యాశాఖ మంత్రి గా అవకాశం కల్పిసై తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధిపై ఆయన దృష్టిపెట్టే అవకాశం ఉంటుందని నేతలు తెలిపారు. ఈకార్యక్రమంలో రామచంద్ర గౌడ్. లాజర్ శాంతిరాజ్. గోపాల్.పవన్. విజయ్ ఉన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తుంది : ఎస్పీ రక్షిత కె మూర్తి



**వనపర్తి టౌన్, జనవరి 29,ప్రభాతవార్త:** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ చిత్తశుద్దితో పనిచేస్తుందని బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదుల పై వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని..వనపర్తి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్.పి రక్షిత కె మూర్తి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటినీ చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేయడం జరిగినది. సోమవారం రోజు జిల్లా నలుమూలల నుండి మొత్తం 07 ఫిర్యాది దారులురావడం జరిగినది.

## ఎమ్మెల్సీ, సర్పంచిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

### కలెక్టర్‌కి వినతిపత్రం అందజేసిన దళిత ప్రజాప్రతినిధులు



కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

**అలంపూరు జనవరి 29 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా ఉండవల్లి, మండలం కలుగొట్ల గ్రామంలో కేజీబివి పాఠశాల ప్రారంభోత్సవంలో దళిత ప్రజాప్రతినిధులను పిలవకుండా దళిత ప్రజాప్రతినిధులను అవమాన పరిచిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, గ్రామ సర్పంచి హురున్నిసా పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని దళిత ప్రజాప్రతినిధులు డిమాండు చేశారు సోమవారం గద్వాలలోని జిల్లా కలెక్టర్ సంతోష్ ని దళిత ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రారంభోత్సవానికి స్థానిక మండల ఎంపీపీ, జడ్పీటీసీని పిలవకపోవడం దళిత సమాజాన్ని, దళిత ప్రజాప్రతినిధులను అవమానించినట్టే అని వాళ్లువాపోయారు.కలెక్టర్ కలిసినవారిలో జడ్పీటీసీలు రాములమ్మ, సుగుణమ్మ, రాజు, ఎంపీపీ బీసమ్మ, బేగం, నాయకులు ఇస్మాయిల్, షేక్షవాలి, ఆచారి, నరసింహా, తేజ తదితరులు పాల్గొన్నారు.

## అత్యున్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ ఏడుకొండలు

**బిజినేపల్లి, జనవరి29 ప్రభాతవార్త :** విద్యార్థులు ఒకే రంగంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని జీవితంలో అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఎక్సైజ్ సిఐ ఏడుకొండలు అన్నారు. చైతన్య యువజన సంఘం, అభ్యుదయ హిందూసేవ సమితి ఆధ్వర్యంలో సోమవారం వట్టెం గ్రామంలో జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సిఐ ఏడుకొండలు మాట్లాడుతూ విద్యార్థులు క్లాస్ రూమ్‌లో లభించే విజ్ఞానంతో పాటు భౌతికంగా, మానసికంగా, సామాజికంగా జ్ఞానాన్ని పెంపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. గ్రామంలో ప్రజలు యువకుల కోరిక మేరకు మూడు రోజుల్లో పూర్తిగా బెల్టు షాపులను తొలగిస్తామని హామీ ఇచ్చారు. బిజినేపల్లి ఎస్సై రాములు యాదవ్ మాట్లాడుతూ యువత మద్య పానం ధూమపానాలకు దూరంగా ఉండాలని చెడు అలవాట్లకు ఇంకా దూరంగా ఉండాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. యువతి ఈ దేశానికి వెన్నుముక అని తమ బంగారు భవిష్యత్తుకు విద్యతో బాటలు వేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని అటువైపుగా అడుగులు వేయాలని సూచించారు. రోడ్డు భద్రత విద్యార్థినిల హక్కులు, అత్యవసర సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వినోద్, రవి, సర్పంచ్ అమృత్‌రెడ్డి, ఎంపిటిసి తిరుపతిరెడ్డి, డిప్యూటి సర్పంచ్, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, మల్లేష్, పర్వతాలు, తిరుపతిరెడ్డి, నర్సింహారెడ్డి, లోకకృష్ణ, నర్సప్ప, భగవంతుగౌడ్ హాజరయ్యారు.

## పార్టీ అభివృద్ధి కొరకై కృషి చేయాలి



బూత్ యూత్ కమిటిని ఎన్నుకున్న దృశ్యం

**అడ్డాకుల, జనవరి 29 ప్రభాతవార్త:** అడ్డాకుల మండలం ముత్యాలంపల్లి రాచాల గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి మండల యూత్ అధ్యక్షులు శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్ యూత్ కమిటి ఏర్పాటు చేయడం జరిగింది. 160వ బూత్ యూత్ అధ్యక్షులు భరత్ కుమార్‌ను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం రాచాల గ్రామంలో 51వ బూత్ యూత్ అధ్యక్షులు టి. భాస్కర్, 52వ బూత్ యూత్ అధ్యక్షులు బి. శ్రీనివాసులు, 53వ బూత్ యూత్ అధ్యక్షులు వి.శ్రీనివాసులు, 54వ బూత్ యూత్ అధ్యక్షులు ఎన్.రాజులను ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాశం తిరుపతయ్య, సింగిల్ విండో డైరెక్టర్ బుచ్చన్నగౌడ్, అనిల్ రాంరెడ్డి, రాంనరసింహ, రఘునాథ్‌రెడ్డి, నాగిరెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ చెన్నకేశవులు, మహేందర్, శరత్ చంద్రారెడ్డి, మహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అనుమతి లేకుండా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత



**కెటిదొడ్డి, జనవరి29 ప్రభాతవార్త:** మండలపరిధిలో సోమవారం తెల్లవారుజామున ఉదయం 5 గం.ల సమయంలో ప్రభుత్వ అనుమతి లేకుండా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కెటిదొడ్డి పోలీసులు పట్టుకున్నారని ఎస్సై వి.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం అయిజ నుంచ కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు టిఎస్ 33 టి 3577 నంబర్ గల బొలేరో వాహనంలో ప్రభుత్వ అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా మల్లాపురం తండా, గ్రామశివారునా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని కెటిదొడ్డి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. డ్రైవర్, ఓనర్ మండ్లఎరుకలి నర్సింహులు తండ్రిరాయచోటి గ్రామం, కర్నూలుజిల్లాపై కేసునమోదు చేయడంజరిగిందని ఎస్సై వి. వెంకటేష్ తెలిపారు.

## అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలి



**చిన్నంబావి, జనవరి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామా లలో ఇండ్ల స్థలాలు లేని పేదలకు ఇంటి స్థలాలను ప్రభుత్వం ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలో గల 15 ఏళ్ల నుంచి నిరుపేదలు ఇళ్ల స్థలాలకు నోచుకోవడం లేదని భూముల రేట్లు పెరగడం మూలంగా పేదలు ఇళ్ల స్థలా లు కొనలేని స్థితిలో ఉన్నారని చిన్నంబావి మండలంలో వెలగొండ, అమ్మాయిపల్లి, దగడపల్లి, వెల్లటూరు, చిన్నంబావి మండల కేంద్రంలోని రత్నగిరి కాలనీ గ్రామాలలో ప్రభుత్వం ఇండ్ల స్థలాల కోసం భూములు కొనుగోలు చేసి 25 సంవత్సరాలు పూర్తి అవుతున్న ఆ భూములను పేదలకు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఇండ్ల స్థలాలు కొను గోలు చేయలేని స్థితిలో ఉన్నటువంటి పేద కుటుంబాలు పెరిగిపోతున్నా యని, అర్హులైన పేదలకు ప్రతి కుటుంబానికి 250 చదరపు గజాల స్థలాన్ని ఇవ్వాలని చిన్నంబావి మండల తహసిల్దార్‌కు వినతి పత్రం ఇవ్వడం జరి గింది. మండలంలో గ్రామాలలో రెవెన్యూ శివారులో గ్రామానికి అనుసరించి ప్రభుత్వ భూములు ఉన్నాయని అట్టి ప్రభుత్వ భూములను సేకరించి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం ప్రకారంగా ఆయా గ్రామాల్లోని పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.వెంకటస్వామి, సభ్యులు తిరుపతయ్య పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

**నారాయణపేట ప్రతినిధి, జనవరి29 ప్రభాతవార్త:** వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సి ఉంటుందని లేదంటే జరిమానా తప్పదని మక్తల్ ఎస్సై వై.భాగ్యలక్ష్మిరెడ్డి వాహనదారులకు సూచించారు. మక్తల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాల తనిఖులు నిర్వహించారు. చాలామంది వాహనదారులు నంబర్ ప్లేట్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా, మైనర్ డ్రైవింగ్ చేస్తూ త్రిబుల్ రైడింగ్ చేస్తూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ, రోడ్డుపైన పార్కింగ్ చేస్తున్న వారికి పోలీస్ స్టేషన్ ఆవరణలోకౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కేవలం వాహనదారులకు జరిమానాలు విధించడం పోలీసుల లక్ష్యం కాదని ప్రతి వాహనదారుడు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడం, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పక పాటించాలని అలాగే నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో వాహనదారులు, పోలీసులు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకుందాం!

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**వెల్దండ, జనవరి29 ప్రభాతవార్త:** నియోజకవర్గాన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల సంక్షేమం అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలోపల్లె దవాఖానా, రైతు వేధిక భవనాలను గ్రామ సర్పంచ్ చెర్క రేవతి రాజశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. నియోజకవర్గంలో రోడ్లు, అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, రూ.500 నుంచి రూ.600కోట్లతో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు బడ్జెట్ అవుతుందన్నారు. జనాభా పెరుగుతున్న కొద్ది మౌళిక సదుపాయాల కోసం కృషి చేస్తామని, 94 గ్రామ పంచాయతీలు ఏర్పడితే 61 గ్రామాలకే భవనాలు మంజూరయ్యాయని, మిగిలిన నూతన గ్రామ పంచాయతీలకు భవనాలు లేవని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో భవనాలు నిర్మించకుండా గ్రామ వ్యవస్థను కుంటు పడేశారన్నారు. ఎమ్మెల్యేగాకు నాకు అవకాశమివ్వడంతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, జెడ్పీటీసీ విజితారెడ్డి,



రైతు వేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎంపీపీ విజయజైపాల్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు యెన్నం భూపతిరెడ్డి, వైస్ ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, ఉప సర్పంచ్ నర్సింహ్మ ముదిరాజ్, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, సర్పంచ్‌లు రామకృష్ణ, పత్యానాయక్, భీరయ్య, వైద్యురాలు స్వరూప, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించాలి

**- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి29 ప్రభాతవార్త:** ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 26 ధరఖాస్తులు ప్రజావాణిలో నమోదయ్యాయి. ధరణి సమస్యలపై 21 ధరఖాస్తులు వచ్చాయి. పంచాయతీ రాజ్ శాఖకు 3 ధరఖాస్తులు, వైద్య ఆరోగ్య శాఖకు 1, ఎస్‌పీడీసీఎల్ శాఖకు ఒకటి చొప్పున ధరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరైన వైద్య, ఆరోగ్య శాఖకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశాలను జారీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు సమర్పించే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచవద్దని చెప్పారు. నల్లమల్ల అటవీ ప్రాంతంలోని చెంచుల ఆవాసాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయా చెంచుగూడెలాకు చెందిన చెంచులు



లబ్ధిదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌కు వినతి పత్రాలను అందించారు. జిల్లా కలెక్టర్‌స్పందిస్తూ తాగునీటికి సంబంధించిన సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణం తదితర మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ప్రజావాణిలో ఉపాధి, పెన్షన్ మంజూరు తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్‌సీతారామారావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కుమార్‌దీపక్‌లుప్రజావాణిలోభాగంగా ధరఖాస్తులను స్వీకరించారు.

# ఆయిల్ పామ్ తోటల సాగు లాభదాయకం

**బిజినేపల్లి, జనవరి 29 ప్రభాతవార్త:** ఆయిల్ పామ్ తోటల సాగు ఎంతో లాభదాయకంగా ఉందని నాబార్డు డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ అచల్ అన్నారు. కారుకొండ గ్రామంలో సాగు అవుతున్న ఆయిల్ పామ్ తోటలను సందర్శించి సాగు విధానంపై తెలుసుకున్నారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి కె. సురేష్ ఆయిల్‌పామ్ క్షేత్ర రైతులైన కొండలరావు తిరుపతయ్య, ప్రవీణ్‌రెడ్డి, భగ్‌వంత్‌రావు, సుదర్శన్‌రావుతో మాట్లాడి పంట నిర్వహణకు అయ్యే ఖర్చును ప్రభుత్వ పరంగా వచ్చే సబ్సిడిల గురించి తెలుసుకున్నారు. రైతులతో చర్చించి పలు సూచనలు చేశారు. దీనితో పాటు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి కె.సురేష్ రైతులతో తోటలలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పంట సాగు కాలంలో చేపట్టవలసిన నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం చేయడం, పీడ చీడ నివారణ వంటి అంశాలపై రైతులకు వివరించారు. జిల్లాలో ఆయిల్ పామ్ తోటలు 2022, 23 సంవత్సరానికి గాను పైలెట్ ప్రాజెక్టుగా 220 ఎకరాలు అదే విధంగా 2023,24 సంవత్సరంలో 3 వేల 57 ఎకరాలు అదేవిధంగా



ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న నాబార్డు డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్

2023,24ఆర్థిక సంవత్సరంలో27000 ఎకరాలు మొత్తంగాను జిల్లాలో 5977 ఇప్పటివరకు సాగవుతున్నాయని తెలిపారు. అంతే కాకుండా ఉద్యానశాఖ ద్వారాలింగసానిపల్లి గ్రామంలోనిర్వహించబడుతున్నఆయిల్ పామ్ నర్సరీని కూడా సందర్శించి మొక్కల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలోనాగర్‌కర్నూల్ డివిజన్‌ఉద్యానఅధికారిమహేశ్వరి పాల్గొన్నారు.

# వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత

- **జంతువులను పరిరక్షించాలి**
- **మహబూబ్‌నగర్ కలెక్టర్ జి.రవినాయక్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 29 ప్రభాతవార్త:** జంతు పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం వన్యప్రాణి సంరక్షణ చట్టం, జంతుహింస విచారణ చట్టం వంటి అనేక చట్టాలను తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ అన్నారు. సోమవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జంతు సంరక్షణపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. జంతువుల పట్ల ప్రతి ఒక్కరు భూతదయ కలిగి ఉండాలని, వాటికి ఎలాంటి హాని చేయకూడదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం జంతు పరిరక్షణ పక్షోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జంతు సంరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ జంతు కళ్యాణ మండలిని (ఎనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ఇండియా)ను సైతం స్థాపించిందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అనేక జంతు సంరక్షణ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. జంతు సంక్షేమంలో భాగంగా ప్రతి పౌరుడు పాటించాల్సిన విధులను తుచ తప్పకుండా పాటించాలని, వీధులలో జరిగేజంతువుల పట్ల కారుణ్యతగా వ్యవహరించాలని, అవసరమైనప్పుడు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ జి. రవినాయక్

వాటికి ఆహారం, తాగునీరు అందించాలని, పక్షులు నివసించే చెట్లను నరకరాదని, పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని, జంతు రవాణా సందర్భంగా తప్పనసరిగా నిబంధనలు పాటించాలని, ఎక్కడైనా వన్యప్రాణులు కనపడినట్లయితే అటవిశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, జంతువులను, పక్షులను బలి ఇవ్వడం నిషేధమని, జంతు సంరక్షణ కొరకు సేవ చేసే వారికి ప్రతి ఒక్కరు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. జిల్లా పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌గౌడ్, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, డిఆర్‌ఓ కెవివి రవికుమార్, జడ్పీ సీఈఓ జ్యోతి, డిఆర్‌డిఓ యాదయ్య, జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# భూములు రిజిస్ట్రేషన్ చేయడంలో నిర్లక్ష్యం తగదు

**లింగాల, జనవరి 29 ప్రభాతవార్త:** భూములను రిజిస్ట్రేషన్ చేయడంలో తహసిల్దార్ నిర్లక్ష్యం చేస్తున్నారని కొంతమంది రైతులు వాపోయారు. సోమవారం లింగాల మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో రైతులకు, తహసిల్దార్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ శనివారం రిజిస్ట్రేషన్ చేయాల్సిన భూములు సోమవారం వరకు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో అమ్మిన రైతులు, కొన్న రైతులు, అలాగే సాక్షులు రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నామని తహసిల్దార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, రెండు రోజులుగా (రిజిస్ట్రేషన్) కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**తహసీల్దార్ ఉమ వివరణ:** ఈ విషయంపై తహసిల్దార్ ఉమాను వివరణ కోరగా రైతులు సరైన పత్రాలు లేకుండానే స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేయాలని అంటున్నారని అన్ని పరిశీలించి రిజిస్ట్రేషన్ చేయడం



లింగాల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న రైతులు

ఆలస్యం జరుగుతుందని అన్నారు. అలాగే సాక్షులను కూడా స్లాట్‌బుక్ చేసిన వారిలో నాలుగు ఉంటే ముగ్గురిని మాత్రమే రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకొని వస్తున్నారని ఆమె తెలిపారు.

## ఫోక్సో కేసులో నేరస్తునికి 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధింపు

**నారాయణపేటప్రతినిధి, జనవరి29 ప్రభాతవార్త:** మాగనూరు మండలం, నేరేడుగాం గ్రామానికి చెందిన కర్రే మొల్లబాలరాజు (22) అనే వ్యక్తి తొమ్మిదో తరగతి చదువుతున్న తన కూతురు మైనర్ బాలికను అప హరించుకుని పోయి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడినట్లు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై నరెందర్ ఎఫ్ఐఆర్ నమోదు చేశా రు. మక్తల్ సీఐ సీతయ్య కేసు ఇన్వెస్టిగేషన్ చేసి నేరస్తుడిపై పిడిజె కోర్టు లో చార్జిషీట్ వేయగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళికృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్పలు కోర్టు లైజర్ ఆఫీసర్ బాలకృష్ణ, కోర్టు డ్యూటీ ఆఫీసర్ల సహాయంతో 15 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి వాదనలు వినిపించగా జిల్లా సెషన్స్ జడ్జి ఎండి రఫీ నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలుశిక్ష రూ.15 వేల జరిమానా విధించ్‌డంతో పాటు బాధితురాలికి రూ. 5 లక్షలపరిహారం ప్రభుత్వం చెల్లించవలసిందిగా తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగాజిల్లా ఎస్పీయోగేష్ గౌతమ్ కేసు ఇన్వెస్టిగేషన్ చేసిన అప్పటి మక్తల్ సిఐ సీతయ్య, అప్పటి ఎస్సై నరెందర్, సిఐరామ్‌లాల్, ఎస్సైమల్లేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళికృష్ణ, ఆకుల బాలప్ప, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎఎస్సై బాలకృష్ణ, కోర్టు కానిస్టేబుల్స్ విజయ్‌కుమార్, రవిందర్ పిసిలను ఎస్పీ అభినందించి త్వరలో రివార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

## వైభవోపేతంగా మహా పడిపూజ

**కోయిల్‌కొండ, జనవరి 29ప్రభాతవార్త:** మండల పరిధిలోని పారుపల్లి గ్రామంలో సోమవారం కావలి రవిలక్ష్మి దంపతులు నిర్వహించిన శివస్వా ముల మహాపడిపూజ కార్యక్రమం వైభవోపేతంగా, కన్నుల పండువగా కొనసాగింది. కార్యక్రమానికి శివస్వాముల గురుస్వామి కానాయపల్లి శివ కుమార్ స్వామి హాజరై శివస్వాములు నిర్వహించే పూజా విధానంపై స్వాములకు దిశా నిర్దేశం చేస్తూ జ్యోతిర్లింగాల మహాపడిపూజ కార్యక్ర మాన్ని కొనసాగించారు. శివుడికి అభిషేకం నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. శివస్వాములు నిర్వహించిన జ్యోతిర్లింగాల మహా పడిపూజ కార్య క్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున శివస్వాములు తరలి రావడమే కాకుండా ఇతర మండలాల నుంచి సైతం శివ స్వాములు భారీగా తరలి వచ్చారు. శివస్వాముల భజన సంకీర్తనలతో ఆడిపాడారు. దీంతో పారుపల్లి గ్రామం అంతా శివనామస్మరణతో మారుమోగిపోయింది. కోయిల్‌కొండ నుంచిగురుస్వాములు యాదయ్య, వీరేష్‌ల ఆధ్వర్యంలో స్వాములు భారీ సంఖ్యలో పారు పల్లి గ్రామానికి చేరుకుని శివస్వాముల మహా పడిపూజలో పాల్గొన్నారు.

## జంతువులను ప్రేమించండి

- **వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**
- **జంతు హింస నివారణపై రూపొందించిన గోడపత్రిక విడుదల**



**వనపర్తి ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త:** నోరులేని మూగజీవాలను అప్యాయతగా చూడాలని జీవ హింస నివారణ ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్లో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టరులు, అధికారులతో కలిసిన జంతు హింస నివారణ పై రూపోందించిన గొడపత్రిక, కరదీపికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంతు హింస నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, నోరులేని మూగ జీవాలను హింసించకుండా వాటికి కనీస ప్రేమఅప్యాయత చూపించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోను ఏ వ్యక్తి కూడా జంతు హింసకు పాల్పడకూడదని చెప్పారు. వీధుల్లో తిరిగే కుక్కలు, పిల్లులు, ఆవులు తదితర జంతు ప్రాణుల పట్ల కరుణతో వ్యవహరించాలని వాటికి తాగునీరు ఆహారం అందించాలని చెప్పారు. జంతు సంరక్షణ కోసం సేవ చేసే వారికి, స్వచ్ఛంద సంస్థలకు ప్రతి పౌరుడు సహకరించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాటు పడాలని సూచించారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

- **వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి**



**వనపర్తి టౌన్, జనవరి29, ప్రభాతవార్త:** క్రీడలు మానసిక ఉల్లాసానికి పెంపొందించడమే కాక మనిషికి, మనిషికి మధ్య ప్రేమానురాగాలు పెంచుతాయని జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డి, క్రికెట్, 100 మీటర్స్ 200 మీటర్స్ లాంగ్ గేమ్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్స్ ను శాంతికపోతాలను, బెలూన్స్ ఎగురవేసి వాలీబాల్‌ను రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచి స్నేహపూర్వకంగా ఆడుకోవాలని అన్నారు. గెలిచినవారు ఓడిన వారిని.. హేళన చేయకుండా స్నేహపూర్వకంగా క్రీడాస్ఫూర్తితో మెలగాలని, అంతేకాకుండా క్రీడల వల్ల శారీరంగా మానసికంగా యువత దృఢంగా తయారవుతారని ఇటువంటి క్రీడలు ఎల్లప్పుడూ నిర్వహించిన తాను ప్రోత్సహిస్తానని తెలియజేశారు.

## రేపు మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

**ఉప్పునుంతల, జనవరి29 ప్రభాతవార్త:** మండలంలో పలు గ్రామాలలో రేపు బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మండలంలోని మామిళ్లపల్లి, బిటి రోడ్డు, ఉప్పరపల్లిలో గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం, హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి శంకస్థాపన, అదేవిధంగా మండలంలోని సదగోడు గ్రామంలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, హెల్త్ సబ్ సెంటర్ భవనం ప్రారంభోత్సవం, మండల కేంద్రమైన ఉప్పునుంతలలో హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన, వెల్టూరు గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన, క్రిటికల్ నుంచి శాండ్‌రోడ్డు వరకుబిటి రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించారు.

## కల్వకుర్తి మున్సిపాలిటిని ఆదర్శ తీర్చిదిద్దాతా..

- **కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
- **కల్వకుర్తి మున్సిపాలిటిలో పలు, అభివృద్ధి పనులకు భూమి పూజ**



చెత్త సేకరణ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, జనవరి 29 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటిగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కల్వకుర్తి మున్సిపాలిటిల్లోని పలు వార్డుల్లో రూ.70లక్షలతో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటి జనరల్ ఫండ్ ద్వారా నూతనంగా కొనుగోలు చేసిన చెత్త సేకరణ వాహనాలను జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, స్థానిక మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంలతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పూజ చేసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహేద్, మాజీసర్పంచ్ బృంగిఆనంద్‌కుమార్, కౌన్సిలర్లు లక్ష్మిరాంరెడ్డి, బోజిరెడ్డి, ఏజాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుశ్రీకాంత్‌రెడ్డి, నాయకులు షాన్‌వాజ్‌ఖాన్, చంద్రకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు, తాహేర్‌అలీ, మసూద్, శేఖర్, ఇక్రం అలీ, సైదులు తదితరులు ఉన్నారు.

**ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్మును ప్రజల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేసే ప్రభుత్వమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలో 75 లక్షల నిధులతో పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. క్యాంప్ కార్యాలయంలో 49 మంది మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ప్రేమతో గెలిపించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మీ సంక్షేమం కోసమే పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన48 గంటల్లో 2గ్యారెంటీ పథకాల్లో అమలు చేశారన్నారు. అదే విధంగా త్వరలో మహాలక్ష్మి రూ.2500లు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేయడం జరుగుతుందని, మిగతా గ్యారెంటీ పథకాల గడువు లోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్‌అధ్యక్షులు కాయితీవిజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఆయా మండలాల నాయకులు తదితరులు ఉన్నారు.



భూమి పూజ చేస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి